ఎంత గింజుకున్నా నిద్ర రావడం లేదు సూరికి. వెల్లకితలా పదుకున్నాడు. కాసేపు ఎడమ వేపుకి తిరిగి పదుకున్నాడు; మరి కాసేపు బోర్లా తిరిగి పదుకున్నాడు. ఊహూ- ఎలా పదుకున్నా నిద్ర రావడం లేదు. మరుసటి రోజున తను ఆ సబ్‌జైలు నుంచి విడుదల అవుతాడనే సంతోషం అతన్ని నిద్ర నుంచి దూరం చేస్తోంది.ఒంట్లో నరనరాలలో చెప్పలేని హాయీ, ఆనందం వెల్లువలా పొంగుతున్నట్టు వుందతనికి.



క్రితం రోజు బాగా వాన కురవటం వల్లనేమో కప్పలు వకటే అరుస్తున్నాయి. మరెప్పుడైనా అయితే అతను విసుక్కునేవాడేమో కానీ, ఈ రాత్రి ఆ అరుపులే గొప్ప సంగీతంలా వుంది.

"ఎంత మందున్నారా ఈ సెల్లులో?" సెంట్రీ టార్చి వేసి గది అంతా కలియ జూస్తూ అడిగాడు.

"ఐదుమంది సార్!" అన్నాడు ఆంజనేయులు.

టార్చిలైటు వెలుతురు కళ్ళను కుక్కకుండా మోచేతిని అడ్డు పెట్టుకున్నాడు సూరి.

సెంట్రీ పక్క సెల్లు వద్దకు వెళ్ళి పోయాడు.

"అప్పుడేం జరిగిందంటే ఆ చోరీకేసు ఒప్పకుంటామని పోలీసోల్లతో అంటిమి... ఏం జేసేది మల్ల? ఒక పక్క జూస్తే పోలీసోల్లు లాఠీలతో కోటింగ్ యిచ్చి శరీరమంతా పచ్చి పుందు మాదిరిగా సేస్తా వుండారు. ఇంకొగ పక్క పదివేల రూపాయిల చోరీ కేసూ... కానీలే దేవుడే ఉండాడు అనేసి ఒప్పకుంటిమి" అంటూ బీడీని అంటించుకోడానికి కాసేపు నిలిపాదు ఆంజ నేయులు.

జాఫర్ గోడకానుకొని 'ఊ'కొడుతూనే ఆవలిస్తున్నాడు.

"ఏం భయ్, అప్పుడే నిద్ర వస్తావుందా!" అడిగాడు ఆంజనేయులు.

"నిద్దర యాడొస్తుంది రా! ఈ దోమలతోనూ, నల్లులతోనూ ఉత్త ఆవులింతలే"

రెండు నెలలుగా ఆ సబ్ జైల్లో ఖైదీల సంగతులన్నీ వినడం మామూలయి పోయింది సూరికి. ఖైదీలందర్లోకి జాఫర్ అంటే సూరికి ఇష్టం.జాఫర్ చూడటానికి నలభై ఏళ్ళు పైబడ్డవాడిలాగా కనిపిస్తాదు. కానీ, తనకు ముప్పయి నాలుగేళ్ళు ఉంటాయన్న విషయం అతను ఏనాడో మరిచి పోయాదు. పదిహేనేళ్ళుగా అతనికి బాగా తెలిసిన పని జేబులు కొట్టడం.

"ఇలాంటి పనివల్ల మీరేం సుఖపడుతున్నారు? జైల్లో మగ్గి పోవడం తప్ప..." అని ఎవరయినా సంస్కరణ వాదులో, మత బోధకులో జైలును చూడ్డానికి వచ్చినప్పుడు అడిగితే...

"సుఖం ఏ వుంటుంది సారూ! మా కట్టమంతా పోలీసోల్ల పాలు, మా శరీరం జైలు పాలు" అని వేదాంతిలా నవ్వుతాదు జాఫర్.

"టైమెంతయింది సార్?" అంటూ ఎదురుగా వున్న సెల్లులో ఎవరో అడిగారు సెంట్రీని.

"పన్నెండు" సెంట్రీ సమాధానం.


ఇంకా పన్నెండు గంటలేనా! ఎప్పటికి అయిపోతుందీ పాడు టైమూ? ఇంకెన్ని గంటలు తను ఈ జైల్లో వుండాలి? అనుకుంటు వేళ్ళ మీద లెక్క వేశాదు సూరి. అంటే కనీసం ఇంకో పది గంటల పాటూ వుండాలన్న మాట. ఇన్నాళ్ళూ నెలల్నీ, వారాల్నీ రోజుల్నీ లెక్క పెదుతున్న సూరి, ఇప్పుడు గంటల్ని లెక్క పెదుతున్నాడు.

ఇక తను ఈ జైల్లో వుండవలసింది పది గంటలే అని అనుకుంటూ వుంటే నిద్రాదేవి మరీ దూరంగా పరిగెత్తుతోంది.

తను విడుదల అవగానే ఇంటికెళ్ళి అమ్మకు కనిపించాలి. ఎంత సంతోష పదుతుందో- పోయిన శనివారం వాడు తనని చూడ్డానికి వచ్చి వకటే ఏడ్చింది. తన కెంతో ఇష్టమని గుత్తి వంకాయ కూరా, జొన్న రొట్టెలూ తీసుకుని వచ్చింది. ఒక జత బట్టలూ, ఐదు రూపాయిలు ఇచ్చింది కూడా.

ఊహించని విధంగా తనకు రెందున్నర నెలలు సామాన్య జైలు శిక్ష వేశారు కోర్టు వారు. జైలులో వున్న రిమాండు కాలాన్ని శిక్షా కాలం నుంచి తీసివేస్తే కేవలం

జంపన పెద్దిరాజు
స్మారక కథల పోటీలో
రు. 500లు బహుమతి
పొందిన కథ



# విడుదల

దేవవ్రత




వారం రోజులు మాత్రమే జైలు శిక్ష అనుభవించాలి తను. అది కూడా ఆ మరుసటి రోజుతో పూర్తవుతుంది.

అంతవరకూ మాటాడుకుంటున్న ఆంజనేయులూ, జాఫర్‌లు అప్పుడే గురకలు పెట్టేస నిద్రపోతూ వున్నారు. జాఫర్ని అలా చూసినప్పుడల్లా సూరికి భలే ఆశ్చర్యం- 'భయంకరమైన జీవితాన్ని గుండెల్లో దాచుకుని విశ్రాంతగా ఎలా నిద్ర పోగలుగుతున్నాడా!'' అని.


''కృష్ణా నీ బారో...'' అంటూ కమ్మటి గొంతుతో పాడుతున్నాడు పదిహేనో నెంబరు సెల్లులో వుంటున్న సాధువు. సాధువుది కన్నడ దేశం. తీర్థయాత్రల కోసం వెళుతూ వుంటే గంజాయి అమ్ముతున్నాడన్న నేరారోపణ మీద పట్టుకొచ్చారు ఎక్సైజు పోలీసులు. అర్ధరాత్రయినా, అపరాత్రయినా కన్నడ తత్వాలూ, పురందరదాసు కీర్తనలు పాడుతూనే వుంటాడు. భాష అర్థం కాకపోయినా అలలుగా సాగే సాధువు కంఠస్వరం అంటే సూరికి ఎంతో ఇష్టం.

** ** **

అన్నిటికంటే తనకు బాధ అనిపించేది ఒకే ఒక్క విషయం... అది, తను జైలులో వున్నట్టు వాళ్ళఊళ్ళో ప్రతి ఒక్కరికీ తెలిసి పోవడం. ఊళ్ళోకి అడుగు పెడుతూనే తనని అందరూ దొంగలాగ చూస్తారేమో! ఆ విషయం తలుచుకుంటున్నప్పుడల్లా గుండెల్లో కలుక్కుమంటోంది సూరికి.

తను ఎప్పుడూ ఏ నేరమూ చేయలేదు. తన తల్లి పేదదయినా ఎంతో క్రమశిక్షణతో పెంచింది. ఒక్కగానొక్క కొడుకని తనని ఏనాడూ గోము చేయలేదు.

'ముండ మోపి కొడుకూ, ముక్కు తాడు లేని ఎద్దూ రెండూ ఒక్కటే' అని జనం ఎప్పుడైనా అనబోతారని ఆవిడ భయం. మరి ఆ రోజు తనలో ఏ దుష్టశక్తి ప్రవేశించిందో ఏమో తన ల్లికి మాట మాత్రమైనా చెప్పకుండా బళ్ళారి ఫ్యాక్టరీలో ఉద్యోగాలున్నాయని శివయ్య మాటలు విని రైలెక్కాడు-శివయ్యతో సహా. బళ్ళారి చేరుకున్నాక గానీ తెలీదు; కార్మికుల సమ్మె కారణంగా ఫ్యాక్టరీ మూత పడిందని. స్వంత ఊరికి తిరిగి రావడం ఇష్టం లేక శివయ్య ఒక హోటల్లో క్లీనరుగా వుండి పోయాడు. సూరికి అలా క్లీనరు పని చేయడమంటే ఇష్టంలేదు. అంధుకే తన ఊరు చేరుకోడానికి గుంతకల్లు రైలెక్కాడు. గుంతకల్లు చేరేటప్పటికి దాదాపు రాత్రి తొమ్మిదిన్నర గంటలయింధి. ఆ వేళప్పుడు తన ఊరికి వెళ్ళే బస్సులు కానీ, రైల్లు కానీ లేవు. తెల్లవారే 'ఫస్ట్‌బస్'కు వెళ్ళవచ్చు కదా అని బస్టాండు చేరుకున్నాడు. బాగా ఆకలిగా వుంది తనకు. ఆకలి తీర్చేటంత డబ్బు లేదు తన దగ్గర. అందుకని బస్టాండు మొగదలలోనే ఉన్న కాకా హోటల్లో రెండు బన్నులు తినేసి, సింగిల్ టీ తాగి క్షుద్బాధను కొంచెం శాంతింపజేశాడు. ఇక తర్వాతి కర్తవ్యం ఎక్కడయినా వీలు చూసుకుని పడుకోడం. ఓసారి బస్టాండు నంత కలయ చూశాడు... అల్లంత దూరంలో రెండు బస్సులు నైట్ హాల్ట్ చేసి నిద్ర పోతున్నాయి. అక్కడక్కడా మూసిన ముఖాలు ముందు పొద్దున్నే ప్రయాణం చేయాల్సిన




ప్రయాణికులు పడుకుని ఉన్నారు. హోటల్ వాడికి డబ్బు చెల్లించి అక్కడికి కొంత దూరంలో వున్న పళ్ళ కొట్టు దగ్గరకు నడిచాడు. జేబు రుమాలుతో బెంచీ లాంటి బండ మీది దుమ్మును దులిపి పడుకున్నాడు సూరి. బస్టాండు ముందున్న ఫ్లోరో సెంటు దీపపు వెలుతురు గుడ్డివెన్నెల్లా తనపై పడుతూ వుంటే మనసుకు ఏదో హాయిగా అనిపించింది. బాగా అలసి పోయాడేమో అయిదు నిమిషాల్లో నిద్ర వచ్చేసింది సూరికి.

ఎవరో తట్టి లేపినట్టయితే కళ్ళు తెరిచి చూశాడు సూరి. ఇంకా తెల్లవారలేదు. ఎదురుగా ఇద్దరు పోలీసులు... కొంచెం గాబరా పడ్డాడు. తన పేరూ, ఊరూ అడిగారు పోలీసులు. తడబడుతూనే సమాధానాలు చెప్పాడు సూరి.

"సరే కానీ, స్టేషన్ కొచ్చి సంతకం చేసి పోమ్మా!" అంటూ నాజూగ్గా చెబుతూనే సూరి జబ్బను వడిసి పట్టుకున్నాడు ఓ పోలీసు కానిస్టేబులు.

"నా సంతకం ఎందుకు సార్? నేనేం దొంగని కాను. పొద్దున్నే ఫస్ట్ బస్సుకు మా ఊరు పోతాను సార్" అన్నాడు సూరి అయోమయంగా చూస్తూ.

"ఇంకేం మాట్లాడకమ్మా, నీతో తీరిగ్గా చర్చించే ఓపిక లేదు కానీ, ముందు స్టేషన్‌కు పదా పోదాం" అంటూ కసిరినట్టే అన్నాడు మరో పోలీసు కానిస్టేబులు.

స్టేషనుకు తీసికెళ్ళాక సూరి జేబుల్ని చెక్ చేశారు- అపాయకర, అభ్యంతరకర వస్తువులు ఏవైనా ఉన్నాయేమోనని. తన దగ్గరున్న బస్ చార్జీ తాలూకు మూడు రూపాయిలు మాయమైనట్టు తర్వాత రోజుక్కాని తెలీదు సూరికి.

"టెలిఫోన్ స్తంభమూ, వైరూ దొంగలించావు కదా ఎక్కడ దాచావురా దొంగలం... కొడకా!" అంటూ

APL ఎ.పి. లైటింగ్స్ వారి విశిష్ట ఉత్పత్తులు ...

★ బల్బులు
★ ఫ్లోరసెంట్ ట్యూబులు
★ ఫిట్టింగులు
★ చోకులు, స్టార్టర్లు.....

నమ్మకానికి, నాణ్యతకు,
సరసమైన ధరకు,
సాటిలేనివి




నిజమే ! అందమైన గృహానికి
మరింత శోభ కూర్చే అలంకారం !!

ఆంధ్రప్రదేశ్ లైటింగ్స్ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి
కార్పొరేషన్‌కు అనుబంధ సంస్థ)
నారాయణగూడ, హైదరాబాదు-29.

చిత్ర హింసలు పెడుతూ ఇంటరాగేట్ చేశారు. మరుసటి రోజు రాత్రి.

"నాకేం తెలీదు మొర్రో, నేనే పాపం ఎరుగను" అంటూ మొత్తుకున్నాడు సూరి. తన మాటలు అన్నీ అరణ్యరోదనలే అయ్యాయి. లాఠీలు సూరీ రక్తం రంగు పూసుకున్నాయి. ఒళ్ళూ, కాళ్ళూ హూనమయ్యాయి. అప్పుడు ఒక్కుకున్నాడు సూరి — వాటిని తనే దొంగిలించినట్లు.

ఆ మరుసటి రోజు మధ్యాహ్నం సూరికి రిమాండు ఇచ్చి సబ్ జైలుకు పంపారు కోర్టువారు.

జరిగిన విషయమంతా తన తల్లికి ఉత్తరం ద్వారా తెలిపాడు సూరి. పేద తల్లి ఏడవడం తప్ప ఏమీ చేయ లేకపోయింది. బెయిలుమీద విడిపించడానికి ఎటువంటి ఆస్థీ, డబ్బూ లేదు మరి.

** ** **

సాధువు పాటలు కూడా అయిపోయాయి. ఎవరూ బెకబెక మనడంలేదు. అంతటా నిశబ్దం ఆవరించి వుంది. దానికితోడు కరెంటు కూడా పోయింది. చుక్కల వెలుతుర్లో లీలగా 12వ నెంబరు సెల్లు కనబడుతోంది. దాని గడియ పడనందువల్ల కొన్ని సంవత్సరాలుగా అది నిరుపయోగంగా వుంటోంది. ఆ సెల్లును చూస్తే సూరికి భయం. సరిగ్గా అర్థరాత్రి ఒంటిగంట సమయంలో ఓ లంబాడి దెయ్యం అందులోంచి బయటికి వస్తుందని, ఆ దెయ్యం వంక తదేకంగా చూస్తే వాళ్ళని ఆవహించి చంపేస్తుందని ఖైదీలంతా చెప్పుకుంటారు. సూరి ధైర్యంగా 12వ నెంబరు సెల్లునే చూశాడు. ఏమీ కనిపించలేదు. ఇంకా అలాగే చూస్తే ఏమయినా కని పిస్తుందేమోనని సందేహంతో చూపు తిప్పేసుకున్నాడు.

బీడీ తాగాలనిపించింది సూరికి. జైల్లోకి వచ్చాకనే బీడీ అలవాటు అయిందతనికి. బీడీ తుంపుల కోసం తన మట్టూ తడిమాడు లాభంలేదు... జాఫర్ని అడగాల్సిందే అనుకుంటూ "జాఫర్ భయ్!" మెల్లిగా పిలిచాడు సూరి.

"ఏరా సూరీ" ఉలిక్కిపడ్డట్టు లేచి అడిగాడు జాఫర్.

"బీడి వుందా భయ్?"

"ఇంకా నిద్రపోలా సూరీ? రేపు రిలీజయిపోతానని నిద్ర వచ్చి వుండదులే... ఒక్కటే బీడి వుందిరా ప్రొద్దున్నే తాగేకని పెట్టుకున్నా... ఇదో తీస్కో" నిద్ర మత్తులోనే మాట్లాడుతూ ఆవులించాడు.

"వద్దులే భయ్! పొద్దునికి నీకే వుండనిలే."

"పొద్దున సంగతి పొద్దునిది లేరా ఇప్పుడు తాగే సెయ్యి... ఎంతో తాగాలనిపిస్తేగాని అడగవు కదా పాపం!" అంటూ బీడీ, అగ్గిపెట్టె అందించాడు జాఫర్.

కరెంటు వచ్చింది. వరండా పై కప్పుకి వున్న దీపం వెలిగింది. సెల్లులోకి కడ్డీల గుండా ప్రసరిస్తూ చాపలా పరుచుకుంది ఆ దీపపు వెలుతురు.

పడుకునే బీడీని వెలిగించాడు సూరి. గుప్, గుప్ మని రెండు దమ్ములు లాగాడు. బారుగా చాచుకున్న తన కాళ్ళను బలంగా తన్నాడు. అవతలి వరుసలో పడుకుని వున్న ఖైదీ. దిగ్గున లేచి చూశాడు సూరి. ఆ ఖైదీ ఎవరో కాదు ఆ సాయంత్రమే వచ్చిన ఖైదీ. అతన్ని చూస్తే సూరికి నవ్వు వస్తుంది. గుండు గీయించుకున్న తలా, కోలమొహం, చెవులకు ఇత్తడి పోగులూ, బిత్తరి చూపులూ, దానికితోడు జొన్న ఒగడులా గాలికికొట్టుకు పోయేట్టు వుంటాడు.

ఇనుప సామానులున్న గోనెసంచి మోసుకుని రైల్వే స్టేషను బయటకు తెస్తే పది రూపాయిలు ఇస్తానని ఇతడి నెత్తిన పెట్టాడు ఓ పెద్దమనిషి. స్టేషను దాటుతూ వుండగానే రైల్వే ప్రొటక్షన్ ఫోర్సు (ఆర్.పి.ఎఫ్.) వాళ్ళు తన్ని పట్టుకున్నారు. గోనె సంచిలో రైల్వే సామానులున్నట్టు కనుక్కున్నారు. పెద్దమనిషి ఎప్పుడో పరారీ అయ్యాడు. ఇతగాడిమీద కేసు నమోదు చేసి జైల్లోకి నెట్టారు ఆర్.పి.ఎఫ్. వాళ్ళు.

ఆ కొత్త ఖైదీలోని అమాయకత్వం చూస్తే ఈ జన్మ లోనే కాదు, ఇక ఏ జన్మలోనైనా ఇతరుల సొమ్ము తాకడానికి ధైర్యంవస్తుందా ఇతనికి అని సూరి సందేహం.

బీడీని చివరికంటా కాల్చేసి వెల్లకిలా పడుకున్నాడు సూరి.

** ** **

ఎప్పుడు నిద్ర పట్టేసిందో తెలీదు సూరికి. తను విడుదల అయినట్టే నిద్రలో కలలు! విడుదల అవగానే నేరుగా వాళ్ళ ఊరికి వెళ్ళాడట. తన తల్లిని ఆశ్చర్య పరచాలని గుడిసె బయటి నుంచే— "ఏమమ్మా! మీ సూరిగాడు ఎక్కడికెళ్ళాడు? వాణ్ణి అరెస్టు చేయాలని వచ్చాను" అని గొంతు మార్చేసి బిగ్గరగా అన్నాడట. ఎంత గట్టిగా పిలిచినా తన తల్లి గుడిసెలోంచి బయ టకి రాలేదట. దాంతో కంగారుపడిపోయి 'అమ్మా! అమ్మా!!' అంటూ గట్టిగా అరుస్తూ వుంటే సూరికి మెళకువ వచ్చేసింది. తన కలకు తనే నవ్వుకున్నాడు సూరి.

తెల్లవాయితోంది.

కాకులు, పిచ్చికలు, గోరువంకలు, చిలుకలు జైలు బయట వున్న చెట్లలోంచి సంతోషంతో కేరింతలు కొడుతూ బాలభానుడికి స్వాగతాలు చెబుతున్నాయి.

తనకిక ప్రతిరోజూ పక్షులకున్నంత సంతోషంతో తెల్లవారుతుంది అని అనుకుంటూ వుంటే ఎంత హాయిగా వుందో!

ఇంకా నిద్రపోతూ వున్న జాఫర్‌మీదా, అంజ నేయులుమీదా, దేవదానంమీదా, కొత్త ఖైదీమీదా జాలి పుట్టుకొచ్చింది సూరికి. "పాపం! ఇంకెన్నాళ్ళకో వీళ్ళకి సంతోషంతో తెల్లవారడం?" అనుకున్నాడోసారి.

** ** **

పదకొండు గంటలయింది.

సూర్యుడు నల్లని మబ్బుల్లో దాక్కొని విశ్రాంతి తీసుకుంటున్నాడు.

సూరిని సెల్లులోంచి బయటకు తీశాడు వార్డరు. ఏవేవో కబుర్లాడుకుంటున్న ఖైదీలు అందరూ వాళ్ళ వాళ్ళ సెల్సు తలుపుల కడ్డీలకు ఆనుకునినుంచుని సూరిని చూస్తూ వీడ్కోలు చెబుతున్నట్టు చేతులూపు తున్నారు.

అందర్నీ ఓసారి కలయజూశాక ఎందుకో కళ్ళల్లో నీళ్ళు పొంగాయి సూరికి.

"వెళ్ళొస్తా జాఫర్ భయ్, అంజనేయులన్నా, దేవ దానం... వెళ్ళొస్తా!" అంటూనే ఏడ్చేశాడు సూరి.

"ఛఛ... రిలీజయిపోతూ నవ్వాలా! ఏడ్వ కూడదు" అంటూనే కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు జాఫర్.

"వెళ్తాను అను సూరి వెళ్ళొస్తా అనొద్దు" నవ్వుతూ అన్నాడు అంజనేయులు.

"ఇంటికెళ్ళాక తీరిగ్గా ఏడ్చుదువులే పైపైపోతా వుంది పదా పోదాం" చిరునవ్వుతో అంటున్న వార్డర్ని అనుసరించాడు సూరి అందరివేపు తిరిగి చేయి వూపుతూ.

** ** **

ఇంతకాలానికి హాయిగా ఏ పోలీసు ఎస్కార్టు లేకుండా స్వంతంగా బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టడం



# రిపబ్లిక్ డే

రిపబ్లిక్ డే (జనవరి 26)ని మన రాజ్యాంగం అమలులోనికి వచ్చిన రోజు (జనవరి 26, 1950)కి గుర్తుగా జరుపుకుంటామన్న సంగతి అందరికీ తెలుసు. కాని దాని వెనుకనున్న కథ చాలామందికి తెలియదు.

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. అప్పటి వైస్రాయ్, లార్డ్ ఇర్విన్ అక్టోబర్ 31, 1929న ఇండియాకు స్వతంత్ర ప్రతిపత్తిని ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కాని కాంగ్రెస్ పూర్తి స్వాతంత్ర్యం కావాలని పట్టు పట్టింది.

జనవరి 26, 1930న జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పతాకాన్ని ఎగురవేయగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ మొదటి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంది. ఆ రోజుకి గుర్తుగా మనకి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నవంబర్ 26, 1949 నాటికే రాజ్యాంగం తయారు చేయబడినప్పటికీ దానిని సరిగ్గా రెండు నెలల తర్వాత జనవరి 26, 1950 నుండి మాత్రమే అమలులోనికి తీసుకొచ్చారు. నాటినుండి జనవరి 26ని రిపబ్లిక్ దినోత్సవంగా మనం జరుపుకుంటు న్నాము.

—నాని.ఎం.

గొప్ప అద్భుతంగా వుంది సూరికి.

ఇన్నాళ్ళూ జైలులో ఎప్పుడెప్పుడా విడుదల అని ఎదురు చూసిన రోజేనా ఈ రోజు!

ఒక్కసారి తన్ను తాను చూసుకొని నవ్వాడు సూరి. పుట్టినప్పటినుంచి స్వేచ్ఛగా బయటి ప్రపంచంలోనే పెరిగాడు. అయితే అప్పుడు ఇంత అందం కనిపించలేదు తనకి. ఒకసారి స్వేచ్ఛను పోగొట్టుకుంటేనే కాని బయటి ప్రపంచపు గొప్ప అందాలు తెలీవేమో మనిషికి.

సబ్‌జైలు ఆవరణ దాటాడు సూరి. పాతిక గజాల దూరంలో ఒక హోటలుంది. అది కోర్టుకు, సబ్ జైలుకు, తాలూకా ఆఫీసుకు సమానదూరం. తనని ఎన్నోమార్లు కోర్టుకు తీసుకుని పోతూ ఆ హోటల్లోకి తీసుకెళ్ళి టీ తాగేవాళ్ళు పోలీసులు. ఒక్కసారి మాత్రం ఒక దయగల పోలీసు టీ కూడా ఇప్పించాడు తనకి.

తన తల్లి ఇచ్చిన ఐదు రూపాయిలున్నాయి జేబులో. ఒక్క టీ తాగితే మరింత హుషారుగా వుండదూ అనుకున్నాడు సూరి. అనుకున్నదే తడవుగా ఉత్సాహంగా అడుగులేస్తూ హోటల్లోకి అడుగుపెట్టాడు.

ఒక టేబుల్ ముందు కూచుని 'స్ట్రాంగ్ టీ'కి ఆర్డరిచ్చాడు. హోటల్ కొంచెం రద్దీగానే వుంది. ఎందుకో తలతిప్పి వెనుకనున్న టేబుల్‌వేపు చూశాడు సూరి. గుండె దడదడలాడింది. తన నెత్తిన బలవంతంగా నేరాన్ని రుద్దిన కానిస్టేబులు, అతని పక్క బక్క ప్రాణిలా వున్న కానిస్టేబులు వున్నారు. సూరి వాళ్ళని



చూడనట్టు తల దించేసుకున్నాడు. గుండెల వేగం మాత్రం మరింత ఉధృతమయింది. తన ఖర్మకాకపోతే ఈ హోటల్లోకే తను రావాలా?

మరో ఆలోచన చేయకుండా వెంటనే లేచాడు సూరి.

గబగబా అడుగులేస్తూ నడవబోయాడు.

కానీ.........

వెనకాల కాలరు పట్టి నిలేసినట్టయింది. ఆగిపోయాడు సూరి. బలవంతాన తలతిప్పి చూసి

"సార్!" అంటూ బలహీనమైన అరుపు అరిచాడు. అందులో వేదన వుంది, రోదన వుంది, భయం వుంది, వణుకు వుంది. జింక మెడను పులి పట్టుకున్నప్పుడు దాని అరుపు అలాగే వుంటుంది. పాము నోట్లో చిక్కినప్పుడు కప్ప అలాగే అరిచి వుంటుంది.

"ఎక్కడికి రా, జారుకుంటున్నావు?" సౌమ్యంగానే మాట్లాడాడు పోలీసు. అయితే సింహానికి కుందేలు డబ్బింగ్ చెప్పినట్టుంది.

"నన్ను జైలు నుంచి ఇప్పుడే విడుదల చేశారు సార్! మా ఊరికి పోతూ వున్నాను" పూడిపోయిన కంఠంతో అన్నాడు సూరి.

"అలాగమ్మా... నీ కోసమే మేం ఇందాక నుంచి వెయిట్ చేస్తున్నాం... స్టేషనుకొచ్చి చిన్నసంతకమొకటి చేసి పోదువుగానీ రామ్మా! ఆ తర్వాత మీ ఊరికి స్వయంగా వచ్చి దించి వస్తాను సరేనా!" అంటూనే పక్కనున్న బక్కప్రాణి కానిస్టేబుల్‌వేపు తిరిగి "సోమూ! వీడితోపాటు స్టేషనుకెళదాం పదా వచ్చిన పని అయిపోయిందిగా" అన్నాడు.

పోలీసు సోమశేఖర్ సూరి జబ్బపట్టుకుని సీనియర్ పోలీసుని అనుసరించాడు.

గొర్రెలా వెంట నడుస్తున్నాడు సూరి. గుండెలు ఇంకెక్కడ వున్నాయి కొట్టుకోవడానికి.

ఆకాశం ఏడుస్తోంది.

ఒక్కొక్క నీటిబొట్టే భూమిని తాకుతోంది. ●


**To Rest** **and Relax** **Select**




# SUDHAKAR FOAM

For high comfort
with low cost

**LATEX FOAM**

**Matteresses, Pillows and Cushions etc.,**

*Mfrs:* **UNI-FOAM INDUSTRIES**

E-9, Industrial Estate
**SURYAPET - 508 214.**

NOTE:There is **Special Discount** sale. Upto **25%** in Hyderabad Exhibition, till **10th February.**